క్లుప్తంగా

తపాలా బీమా పాలసీల్లో మండపేట అగ్రస్థానం



అత్యధిక పాలసీలు చేయించి ప్రశంసలు అందుకుంటున్న ఉద్యోగులు

మండపేట: తపాలా శాఖలోని ఇండియా పోస్ట్ పేమెంట్ బ్యాంక్ ప్రవేశపెట్టిన ప్రమాద బీమా పాలసీలను చేయించడంలో మండపేట తపాలా కార్యాలయం ముందు వరుసలో ఉంది. ప్రమాద బీమా పథకానికి సంబంధించి బుధవారం ఒక్కరోజులోనే రికార్డు స్థాయిలో 125 పాలసీలు చేయించినట్టు పోస్టుమాస్టర్ జి.శివయ్య గురువారం ఇక్కడ వెల్లడించారు. రాష్ట్ర స్థాయిలో రామచంద్రపురం పోస్టల్ సబ్ డివిజన్ ప్రథమ స్థానంలో నిలిచినట్టు చెప్పారు. తమ కార్యాలయంలో పోస్టల్ అసిస్టెంట్ కొండపల్లి సూర్యనారాయణ, కేవీ నారాయణరావు(బాబి) విశేషంగా శ్రమించినట్టు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా తపాలా ఉద్యోగులను మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి ప్రత్యేకంగా అభినందించారు. రిటైర్డ్ పోస్టుమాస్టర్ టి పుల్లేశ్వరరావు, పోస్ట్‌మన్ ఉద్యోగుల నాయకులు కె.ఈశ్వరరావు, ఎండీఎం షరీఫ్‌తో పాటు, తపాలా ఉద్యోగులు హర్షం వ్యక్తం చేశారు.

మాజీ సర్పంచ్ సుబ్బయ్యమ్మ కన్నుమూత



లంక సుబ్బయ్యమ్మ(ఫైల్)

రాయవరం: లొల్ల మాజీ సర్పంచ్ లంక సుబ్బయ్యమ్మ(56) గురువారం కన్నుమూశారు. ఆమెకు నలుగురు కుమార్తెలు, కుమారుడు శ్రీను ఉన్నారు. గుండెపోటుతో ఆమె కుప్పకూలినట్టు కుమారుడు శ్రీను తెలిపాడు. ఆమె 1995–2001 వరకు సర్పంచ్‌గా కొనసాగారు. ఆమె కుమారుడు ప్రస్తుతం స్థానిక ప్రాథమికోన్నత పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్‌గా ఉన్నారు. ఇద్దరికి చూపునివ్వాలనే సదుద్దేశంతో సుబ్బయ్యమ్మ తన నేత్రాలను బాదం బాలకృష్ణ ఐ–బ్యాంక్‌కు దానం చేశారు. ఆమె మరణానికి సర్పంచ్ చాట్రాతి జానకిరాంబాబు, మాజీ ఎంపీటీసీ చేవా సత్యనారాయణ తదితరులు సంతాపం ప్రకటించారు.

మద్యం తరలింపు కేసులో ఇద్దరి అరెస్టు



కారు, మద్యం బాటిళ్లతో ఎస్సై పరదేశి

కపిలేశ్వరపురం: మద్యాన్ని అక్రమంగా తరలిస్తున్న ఇద్దరిపై అంగర పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. ఎస్సై అండె పరదేశి వివరాల మేరకు, కపిలేశ్వరపురం శివారు దోర్లమ్మ ఆలయ సమీపంలో బుధవారం వాహనాలను తనిఖీ చేస్తుండగా, రాజమహేంద్రవరానికి చెందిన పాతాలం రవితేజ, కొవ్వూరు మండలం ధర్మవరానికి చెందిన సరిపల్లి మహేష్‌బాబు కారులో తారసపడ్డారు. వీరిని అరెస్టు చేసి, రూ.4,332 విలువైన 36 మద్యం బాటిళ్లు, కారును స్వాధీనం చేసుకున్నారు. నిందితులను కోర్టుకు తరలించగా, మేజిస్ట్రేట్ రిమాండ్ విధించారు.

నిబంధనలకు అనుగుణంగా కొబ్బరి కొనుగోళ్లు



అంబాజీపేటలో కొబ్బరి కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న నాఫెడ్ మేనేజర్ సుధాకరరావు

అంబాజీపేట: స్థానిక మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన నాఫెడ్ కొనుగోలు కేంద్రం ద్వారా నిబంధనలకు అనుగుణంగా కొబ్బరిని కొనుగోలు చేస్తామని ఏపీ ఆయిల్ ఫెడ్ సీనియర్ మేనేజర్ యు.సుధాకరరావు తెలిపారు. అంబాజీపేట మార్కెట్ యార్డ్‌లోని కొబ్బరి కొనుగోలు కేంద్రంలో గురువారం కొనుగోళ్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు ఎకరానికి రెండు బస్తాలు నెలకు విక్రయించుకోవాలన్నారు. రైతు ఒకేసారి రిజిస్ట్రేషన్ చేయించుకునే వీలుంటుందన్నారు. కొబ్బరి విక్రయించిన 15 రోజుల్లో రైతుల ఖాతాకు సొమ్ము జమ చేస్తామన్నారు. కొబ్బరి కొనుగోలు కేంద్రం సోమవారం నుంచి శుక్రవారం వరకూ పని చేస్తుందన్నారు. అంతకు ముందు కళ్లాల్లో ఆరబెట్టిన కొబ్బరిని సుధాకరరావు, కృషీవల కోకోనట్ ఫార్మర్స్ ప్రొడ్యూసర్స్ కంపెనీ చైర్మన్ గణపతి వీరరాఘవులు, సీఈఓ అడ్డాల గోపాలకృష్ణ పరిశీలించారు.

కాలువ రపాటు

- కాలుష్యం మాటున టేకి డ్రైనేజీ
- పరిశ్రమల వ్యర్థాలతో చేటు
- అంతరిస్తున్న మత్స్య సంపద
- పట్టించుకోని అధికారులు

కె.గంగవరం: నిండా నిర్లక్ష్యం అలుముకుంది.. మురుగునీటి పారుదలకు అత్యంత కీలకమైన డ్రైనేజీ వ్యవస్థ నానాటికీ తీసికట్టుగా మారుతోంది.. పారిశ్రామిక కాలుష్యంతో డ్రైనేజీల్లో మత్స్య సంపద కూడా అంతరించిపోతుంది. పంట పొలాల్లో ముంపు, ఊట నీరు దిగేందుకు ఏర్పాటైన టేకి డ్రైనేజీని అధికార యంత్రాంగం నిర్లక్ష్యంగా వదిలేసింది. కె.గంగవరం మండలంలోని టేకి డ్రైనేజీ ఆనుకుని సుమారు 20 వేల ఎకరాల పంట పొలాలు ఉన్నాయి. ఆలమూరు మండలం వద్ద ప్రారంభమైన ఈ డ్రైనేజీ కపిలేశ్వరపురం, రాయవరం, కె.గంగవరం, కాజులూరు, తాళ్లరేవు మండలాల మీదుగా ప్రవహించి కోరంగి వద్ద సముద్రంలో కలుస్తోంది. సుమారు 56 కిలోమీటర్ల పొడవు ఉన్న ఈ మురుగు కాలువ ఐదు మండలాల్లోని రైతులకు ఆధారమైంది. చిన్న మురుగు కాలువగా ఉన్న టేకి డ్రైనేజీ కె.గంగవరం, కాజులూరు, తాళ్లరేవు వచ్చేసరికి ప్రధాన మురుగు కాలువగా మారుతోంది. ఈ ఐదు మండలాల రైతులకు వరదలు, తుపాన్లు సంభవించిన సమయంలో టేకి డ్రైనేజీ ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది.

చేప పడక.. ఉపాధి లేక..

టేకి డ్రైనేజీపై ఆధారపడి అనేక మంది మత్స్యకారులు జీవనోపాధి పొందుతున్నారు. వేసవిలో మూడు నెలల పాటు ఫ్యాక్టరీ నుంచి వచ్చే వ్యర్థాల కారణంగా కాలువలో మత్స్య సంపద చనిపోతోంది. దీనివల్ల మత్స్యకారులు ఉపాధి కోల్పోతున్నారు. రాత్రి వేళల్లో వాయు కాలుష్యంతో కిలోమీటర్ల మేర గ్రామాల్లో దుర్వాసన వెదజల్లి ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. కొన్నేళ్లుగా ఈ తంతు జరుగుతున్నా కాలుష్య నియంత్రణ మండలితో పాటు డ్రైనేజీ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా తగిన చర్యలు తీసుకోవాలని రైతులు, ఆయా గ్రామాల ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

గోడు వినక.. బాగుపడక

ఏ కాలమైనా వర్షాలు పడితే ముంపు, ఊట నీరు పంట పొలాల దిగేందుకు టేకి డ్రైనేజీ ఎంతో ఉపయోగపడుతోంది. పాడి రైతులు తమ పశువులను మేపుకొని వాటికి తాగునీటి కోసం టేకి డ్రైనేజీనే వినియోగించుకునేవారు. రాను రాను ఈ డ్రైనేజీని ఆనుకుని పరిశ్రమలు పెరిగాయి. పారిశ్రామికతకు తోడు ఈ కాలువ కాలుష్యం కోరల్లో చిక్కుకుంది. రాయవరం మండల ప్రారంభం నుంచి డ్రైనేజీ గట్టునే ఉన్న రైస్ మిల్లులు, ఇతర ఫ్యాక్టరీ నుంచే మొలాసిస్, తదితర వ్యర్థాలు టేకి డ్రైనేజీలోకి వదలడంతో మొత్తం నీరు గరళంలా మారుతోంది. ఈ మొలాసిస్‌తో ఆయా మండలాల్లో కాలువ పరిసర ప్రాంత ప్రజలకు దుర్వాసన వెదజల్లుతుంది. అంతేకాకుండా కె.గంగవరం వద్ద పేపర్‌మిల్లు వ్యర్థాలూ వదిలేస్తుండడంతో పూర్తిగా స్వరూపమే మారిపోతుంది. ఆయా మండలాల్లోని రైతులు తమ పశువుల తాగునీటికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.



కె.గంగవరం మండలం దంగేరు వద్ద పరిశ్రమల వ్యర్థాలతో నల్లగా మారిన టేకి డ్రైనేజీ నీరు

చర్యలు అవసరం



కాలుష్య కోరల్లో నుంచి టేకి డ్రైనేజీని రక్షించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలి. దాదాపు మండలంలోని 10 గ్రామాల ప్రజలు ఈ డ్రైనేజీపైనే ఆధారపడి వరి సాగు చేస్తున్నారు. కలుషితమవుతున్న నీటి వల్ల రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించాలి.

–రాయుడు నాగేశ్వరరావు, రైతు, పేకేరు

పశువులకూ నీరు దొరక్క..



డ్రైనేజీ నీరు కలుషితం కావడంతో పశువులకు తాగునీరు అందడం లేదు. కాలువను ఆనుకుని ఉన్న పలు గ్రామాలకు చెందిన పాడి రైతులు ఈ కాలువ పక్కనే పశువులను మేపుతున్నారు. పశువులకు నీరు లేక నానా ఇబ్బందులు పడుతున్నారు.

–పిల్లి వెంకటేశ్వర్లు, పాడి రైతు, పేకేరు

ఎస్సీ వర్గీకరణ తీర్పుపై విజయోత్సవాలు



రాయవరంలో కేక్ కట్ చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు



సంబరాలు చేసుకుంటున్న దళిత సంఘాల నేతలు, కార్యకర్తలు

రాయవరం: ఎస్సీ వర్గీకరణ న్యాయ సమ్మతమేనంటూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు దేశ చరిత్రలో సువర్ణ అధ్యాయంగా మిగిలిపోతుందని ఎమ్మార్పీఎస్ జిల్లా వర్కింగ్ కమిటీ అధ్యక్షుడు ధూళి జయరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి చుక్కా శేషు అన్నారు. రాయవరంలో ఎమ్మార్పీఎస్ విజయోత్సవం నిర్వహించారు. సర్పంచ్ చంద్రమళ్ల రామకృష్ణ ఆధ్వర్యంలో నాయకులు విజయోత్సవాన్ని జరుపుకొన్నారు. ఈ సందర్భంగా జయరాజు మాట్లాడుతూ ఇది రాజ్యాంగ విజయమన్నారు. రెండు తెలుగు రాష్ట్రాలు వెంటనే ఎస్సీ వర్గీకరణకు ప్రత్యేక తీర్మానాలు చేసి అమలు చేయాలన్నారు. అంతకుముందు వారు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు నివాళులర్పించారు. సంఘ జిల్లా కార్యదర్శి దార్ల సతీష్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నాయకుల సంబరాలు

మండపేట: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు నిర్ణయం హర్షణీయమని, 30 ఏళ్ల తమ పోరాటం ఫలించిందని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి దూలి జయరాజు, ఎమ్మార్పీఎస్‌ఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు బుంగ సంజయ్ మాదిగ వేర్వేరు సమావేశాల్లో హర్షం తెలిపారు. పట్టణంలో గురువారం నాయకులు, కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు. ఎస్సీ పేట నుంచి డప్పులు వాయించుకుంటూ బస్టాండ్ సెంటర్ వరకూ ర్యాలీ నిర్వహించారు. తమ కల నెరవేరిందంటూ ఒకరికొకరు స్వీట్లు తినిపించుకున్నారు. వర్గీకరణ కోసం ఎన్నో ఏళ్లుగా శ్రమిస్తున్న మందకృష్ణకు, వివిధ సంఘాల నాయకులకు, కార్యకర్తలకు ఈ సందర్భంగా సంజయ్ మాదిగ ధన్యవాదాలు తెలిపారు. అలాగే ఎస్సీ వర్గీకరణ అంశంపై సుప్రీంకోర్టు అనుకూలంగా తీర్పు వెలువరించడంపై దళిత నేత పలివెల సుధాకర్ హర్షం ప్రకటించారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ కోసం మంద కృష్ణ మాదిగ అలుపెరగకుండా ఉద్యమాన్ని కొనసాగించారని కొనియాడారు.

పింఛన్ల పంపిణీ



రామచంద్రపురంలో పింఛన్లు పంపిణీ చేస్తున్న మంత్రి సుభాష్

రామచంద్రపురం: స్థానిక ఆరో వార్డులో రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ గురువారం పింఛన్ల పంపిణీని ప్రారంభించారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, టీడీపీ పట్టణ అధ్యక్షుడు కడియాల రాఘవన్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగురాలికి పింఛను అందజేత

మండపేట: సామాజిక పెన్షన్లకు సంబంధించి ఈ నెల పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు గురువారం ప్రారంభించారు. స్థానిక 24వ వార్డులో ఓ దివ్యాంగురాలికి ఆయన రూ.15 వేల పింఛను అందజేశారు. నియోజకవర్గంలో మొత్తం 39,283 మంది లబ్ధిదారులకు రూ.16.54 కోట్లు పంపిణీ చేశామన్నారు. పట్టణంలో మధ్యాహ్నానికి 95 శాతం పింఛన్ల పంపిణీని పూర్తి చేయించామని కమిషనర్ బొడ్డేపల్లి రాము తెలిపారు. మున్సిపల్ మాజీ చైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్ పాల్గొన్నారు.



దివ్యాంగురాలికి పింఛను ఇస్తున్న ఎమ్మెల్యే

రామచంద్రపురం రూరల్: వలంటీర్ వ్యవస్థను కూటమి ప్రభుత్వం నిర్వీర్యం చేసింది. దీంతో పింఛన్ల పంపిణీ అంతంతమాత్రంగా జరుగుతోంది. మండలంలోని అన్ని శాఖల అధికారులకు పంపిణీ డ్యూటీలు వేశారు. దీంతో వారంతా గురువారం మండలంలోని 25 గ్రామాల్లో పింఛన్ల పంపిణీని పర్యవేక్షించారు. మండలంలో 96.42 శాతం పూర్తి చేశారు.

అదుపు తప్పిన స్కూల్ బస్సు



ప్రమాదానికి గురైన బస్సు నుంచి విద్యార్థులను దించుతున్న స్థానికులు

రామచంద్రపురం రూరల్: మండలంలోని తాళ్లపొలం శివారు అడపావారి సావరంలో గురువారం ఓ ప్రైవేట్ స్కూల్ బస్సు రోడ్డు మార్జిన్‌లో అదుపు తప్పి, దిగబడింది. బస్సు నిండా విద్యార్థులు ఉండటంతో అంతా కంగారు పడ్డారు. కానీ స్థానికులు సకాలంలో స్పందించి ట్రాక్టర్ సాయంతో బస్సును పైకి లాగి విద్యార్థులను బస్సు ఎక్కించి పంపించారు. తమ గ్రామానికి రోడ్డు సరిగ్గా లేక తరచూ ప్రమాదాల బారిన పడుతున్నామని గ్రామస్తులు అన్నారు.

రక్షణ... ఆ మాటెక్కడ!



రక్షణ గోడలు లేక ప్రమాదభరితంగా మారిన కల్వర్టు

కాజులూరు: అటుగా వెళ్లాలంటే కాస్త ఆగాల్సిందే.. ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా డ్రైన్‌లోకే.. దుగ్గుదుర్రు–ఉప్పుమిల్లి రహదారిలో డ్రైన్‌పై ఉన్న కల్వర్టు ప్రమాదకరంగా మారింది. సుమారు 15 ఏళ్ల కిందట నిర్మించిన ఈ కల్వర్టుకు ఇరువైపులా రక్షణ గోడలు నిర్మించలేదు. దీనికి ఇరువైపులా రోడ్డు మలుపు తిరిగి ఉంది. రాత్రి సమయాల్లో వేగంగా వచ్చే వాహనదారులు అదుపుతప్పి ప్రమాదాలకు గురవుతున్నాయి. అయినప్పటికీ కల్వర్టును మాత్రం అధికారులు పట్టించుకోకపోవడంతో స్థానికులు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కల్వర్టుకు ఇరువైపులా రక్షణ గోడలు నిర్మించాలని కోరుతున్నారు.

వైభవంగా లక్ష్మీనృసింహుని కల్యాణం



అంతర్వేదిలో స్వామి కల్యాణం నిర్వహిస్తున్న పండితులు

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని ఆలయంలో గురువారం ఆర్జిత సేవగా స్వామివారి శాంతి కల్యాణం ఘనంగా జరిగింది. తొలుత ఆలయంలోని కల్యాణ మండపంలో ప్రత్యేక వేదికపై ఉత్సవ మూర్తులను కొలువుదీర్చారు. అనంతరం స్వామివారి శాంతి కల్యాణాన్ని అర్చకులు ప్రారంభించారు. వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ ప్రధాన అర్చకుడు పాణింగిపల్లి శ్రీనివాస కిరణ్ ఆధ్వర్యాన స్థానాచార్య వింజమూరి రామరంగాచార్యులు, అర్చకుడు పెద్దింటి వేంకట శ్రీనివాస్, వేద పండితులు ఈ కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ ఆధ్వర్యంలో కల్యాణంలో పాల్గొన్న భక్తులకు దేవస్థానం స్వామి మూలవిరాట్ దర్శనం కల్పించింది. అలాగే లడ్డూ ప్రసాదం ఇచ్చి, అన్నదాన పథకంలో భోజన సౌకర్యం ఏర్పాటు చేసింది.

మత్స్యకారుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం

కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి



కొండబాబును సత్కరిస్తున్న మత్స్యకార నాయకులు

మండపేట: మత్స్యకారుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తుందని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు అన్నారు. మత్స్యకారుల మనుగడకు ప్రశ్నార్థకంగా ఉన్న జీవో నం.217 రద్దు చేయడానికి తగిన చర్యలు తీసుకోవాలని డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌కు, ఐటీ మంత్రి నారా లోకేష్‌కు తెలియజేస్తానన్నారు. మండపేటలోని సూర్యచంద్ర నెయ్యల కుల కల్యాణ మండపం వద్ద గురువారం మత్స్యకార సంక్షేమ సంఘం ప్రమాణ స్వీకారోత్సవంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొండబాబుతో పాటు, మున్సిపల్ మాజీ చైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్‌ను సన్మానించారు. ఆంధ్రప్రదేశ్ నెయ్యల కుల సంక్షేమ సంఘం నూతన కార్యవర్గానికి ఎమ్మెల్యే కండువాలు కప్పి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘ రాష్ట్ర అధ్యక్షుడు కాటా గోపి, కార్యదర్శి మండాది గిరి, ఉత్తరాంధ్ర గౌరవాధ్యక్షుడు సోమశేఖర్, కోస్తా ఆంధ్ర గౌరవాధ్యక్షుడు విష్ణుమూర్తి, శ్రీను, అంపోలు సత్యనారాయణ, జంపా వెంకటరమణ, రాష్ట్ర మత్స్యకార సంఘ నాయకులు పాల్గొన్నారు.



రక్షణ గోడలు కూలి ప్రమాదకరంగా మారిన సమనస వంతెన

ప్రమాదకరంగా వంతెన

అమలాపురం రూరల్: మండలంలోని సమనస లాకుల వద్ద పంట కాలువపై నిర్మించిన వంతెన రక్షణ గోడలు విరిగి ప్రమాదకరంగా మారింది. అమలాపురం, చల్లపల్లి ప్రధాన రహదారి నుంచి ఈ లాకుల మీదుగానే పలు గ్రామాల ప్రజలు ప్రయాణిస్తుంటారు. నిత్యం స్కూల్ బస్సులు, చిన్నారులను తీసుకెళ్లే ఆటోలు సైతం ఇటుగా వెళుతుంటాయి. అయితే వంతెన రక్షణ గోడలు కూలిపోవడంతో ఏ క్షణంలో ఎలాంటి ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు భయపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వంతెనకు రక్షణ గోడ పునర్నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

డిమాండ్ల సాధనకు మున్సిపల్ ఉద్యోగుల నిరసన



యానాంలో నిరసన దీక్ష చేస్తున్న మున్సిపల్ ఉద్యోగులు

యానాం: పుదుచ్చేరి రాష్ట్ర మున్సిపాలిటీ, కమ్యూన్ పంచాయతీ ఉద్యోగుల రాష్ట్ర వ్యాప్త పిలుపు మేరకు గురువారం యానాం మున్సిపల్ ఉద్యోగులు తమ డిమాండ్ల సాధన కోసం ఒకరోజు నిరసన దీక్షను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ జీతాలు ట్రెజరీ ద్వారా చెల్లించాలని, అదేవిధంగా ఉద్యోగ విరమణ చేసిన వారికి పెన్షన్లు, రావాల్సిన బెనిఫిట్స్ మంజూరు చేయాలని, కారుణ్య నియామకాలు జరపాలని, ఉద్యోగులకు బకాయి వేతనాలు తక్షణం చెల్లించాలని డిమాండ్ చేశారు. డిమాండ్లు నెరవేర్చకపోతే ఈ నెల 6వ తేదీ నుంచి నిరసన మళ్లీ ప్రారంభిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు పి.కృష్ణ, ఉపాధ్యక్షుడు కర్రి రాంబాబు, ట్రెజరర్ చెల్లి గోపి తదితరులు పాల్గొన్నారు.

డ్రైన్లలో పూడికతీతకు చర్యలు తీసుకోవాలి

కాజులూరు: డ్రైన్లలో పూడికతీతకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఏపీ కౌలురైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వలుం రాజబాబు డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని శీల, ఒంటితాడి, కాజులూరు, చేదువాడ తదితర గ్రామాలలో రైతు సంఘాల నాయకులు పర్యటించారు. డ్రైన్ల వెంబడి ఉన్న పంట పొలాలను పరిశీలించారు. శీలలో ఆయన మాట్లాడుతూ భారీ వర్షాల కారణంగా మండలంలో పంట పొలాలు ముంపునకు గురై రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. జిల్లాలో ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న డ్రైన్లన్నీ కాజులూరు, తాళ్లరేవు మండల గ్రామాల మీదుగా ప్రవహిస్తూ సముద్రంలో కలుస్తున్నాయన్నారు. ఇవి పూర్తిగా పూడుకుపోయి ఉండటంతో పాటు స్థానికంగా కురిసే వర్షాలకు తోడు ఎగువ నుంచి వచ్చి చేరుతున్న వరద నీరు పొలాల్లోకి చేరి రోజుల తరబడి నిలిచిపోతుందన్నారు. అధికారులు స్పందించి డ్రైన్ల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలన్నారు. కౌలురైతు సంఘ నాయకులు చింతపల్లి దుర్గారావు, చెల్లి రాంబాబు, ఎం.ప్రసాద్, గుత్తుల రామకృష్ణ, పిల్లి శ్రీను, ఆర్.సత్తిబాబు, సాయి, చోడి నాగు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో ఎన్నికల సందడి

రాయవరం: ప్రభుత్వ పాఠశాలల్లో పాఠశాల యాజమాన్య కమిటీల ఏర్పాటుకు గురువారం నోటిఫికేషన్ విడుదల చేశారు. జిల్లా వ్యాప్తంగా 1,578 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో ఎస్ఎంసీ సభ్యులను ఎన్నుకున్న అనంతరం చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక జరగనుంది. విద్యార్థుల తల్లిదండ్రుల్లో తల్లి లేదా తండ్రిలో ఎవరో ఒకరికి మాత్రమే ఓటు హక్కు ఉంటుంది. ఒక వేళ విద్యార్థికి తల్లి, తండ్రి జీవించి లేకుంటే సంరక్షకుడుకు ఓటు హక్కు కల్పిస్తారు.

నిత్యాన్నదాన ట్రస్టుకు విరాళం



దాత శ్రీనివాసరావు దంపతులకు స్వామివారి చిత్రపటం అందిస్తున్న ఆలయ ఉద్యోగులు

మామిడికుదురు: అప్పనపల్లి శ్రీబాల బాలాజీ స్వామివారి ఆలయంలో నిత్యాన్నదాన ట్రస్టుకు అమలాపురానికి చెందిన శిఖా శ్రీనివాసరావు, నాగమణి దంపతులు గురువారం రూ.20,116 విరాళంగా సమర్పించారు. దీనిని ఆలయ ఉద్యోగులకు అందజేశారు. దాత శ్రీనివాసరావుకు ఆలయ ఈఓ గ్రంధి మాధవి ఆధ్వర్యంలో స్వామివారి చిత్రపటం, ప్రసాదం ఇచ్చారు.

హడలెత్తించిన నల్లతాచు



నల్లతాచును బంధిస్తున్న స్నేక్ క్యాచర్ గణేష్‌వర్మ

అంబాజీపేట: ముక్కామల పశు వైద్యశాలలోని బీరువాలో నల్లతాచు హడలెత్తించింది. ఆసుపత్రి సిబ్బంది గురువారం విధులు నిర్వహిస్తున్న సమయంలో బీరువాలో దాగి ఉన్న నల్లతాచును చూసి భయాందోళనకు గురయ్యారు. దీంతో భీమనపల్లికి చెందిన స్నేక్ క్యాచర్ గణేష్‌వర్మకు సమాచారం ఇచ్చారు. అతను సంఘటనా స్థలానికి చేరుకుని పామును పట్టుకుని ప్లాస్టిక్ డబ్బాలో బంధించారు. అనంతరం జనవాసం లేని ప్రాంతంలో పామును విడిచిపెట్టారు. వరదలు అధికంగా వస్తున్న నేపథ్యంలో పాముల బెడద ఎక్కువగా ఉంటుందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు చెబుతున్నారు.

నిండా ముంచి..
నష్టం మిగిల్చి



అప్పనపల్లిలో తోట నుంచి అరటి గెలలు సేకరిస్తున్న రైతులు

- కుళ్లిపోయిన పంటలు
- రైతులకు కష్టాలు

మామిడికుదురు: వరద నిండా ముంచింది.. రైతు కష్టాన్ని మింగేసింది.. ఆరుగాలం శ్రమించి పండించిన ప్రతి పంట ముంపునీరు బారిన పడింది. దిగుబడి చేతికి వచ్చే సమయంలో వరద తమను నిలువునా ముంచిందని రైతన్న గుండె విలపిస్తోంది. అరటి, బీర, బెండ, మునగ, బొప్పాయి, తమల పాకులు, పూల తోటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. లాభాల మాట ఎలా ఉన్నా రూ.లక్షల్లో నష్టపోయామని రైతులు అంటున్నారు. మామిడికుదురు మండలంలో 38 హెక్టార్లలో అరటి పంట దెబ్బతినగా, 101 మంది రైతులు నష్టపోయారని అంచనా. 45 హెక్టార్లలో కూరగాయల పంట పాడవగా, 120 మంది రైతులకు నష్టం వాటిల్లిందని హార్టికల్చర్ అధికారులు తెలిపారు. పి.గన్నవరం మండలంలో 382.30 హెక్టార్లకు 1260 మంది రైతులు, అయినవిల్లి మండలంలో 440.70 హెక్టార్లకు 1,548 మంది, అంబాజీపేట మండలంలో 19 హెక్టార్లకు 34 మంది రైతులు నష్టపోయారు. వీటితో పాటు రాజోలు, కొత్తపేట నియోజకవర్గాల్లోని ఏడు మండలాల్లో వరద ప్రభావంతో పంటలకు తీవ్రంగా నష్టం వాటిల్లింది. గోదావరి వరద ఇంకా పూర్తి స్థాయిలో తగ్గుముఖం పట్టలేదు. ఈ నష్టం మరింత పెరిగే అవకాశం ఉందని చెబుతున్నారు.